రోడ్డుపై బైఠాయించిన ఆందోళనకారులు

యువకులపై దాడికి నిరసనగా అందోళన

రుద్రూర్, జనవరి 23: మండలంలోని సులేమాన్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన శోభాయాత్రలో చిన్న ఘర్షణ చోటుచేసుకోగా, గ్రామ పెద్దలు కలుగజేసుకొని ఉదయం మాట్లాడుదామని సముదాయించారు. మంగళవారం ఉదయం స్థానిక సర్పంచ్ ఇరువర్గాల వారిని పిలిపించి మాట్లాడుతుండగా.. ఇద్దరు యువకులపై మరో వర్గానికి చెందినవారు దాడి చేశారు. దీంతో బాధితులతోకలిసి బజరంగ్‌దళ్ కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ జయేశ్‌రెడ్డి, ఎస్సై మహేందర్ అక్కడి చేరుకొని వారిని సముదాయించినా వెనక్కి తగ్గలేదు. దాడి చేసినవారిపై కేసు నమోదుచేసి కఠినంగా శిక్షించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏసీపీ హామీ మేరకు ఆందోళనకారులు శాంతించారు.

గడువులోగా సీఎంఆర్ పూర్తిచేయాలి

కోటగిరి, జనవరి 23: మండలంలోని పలు రైస్‌మిల్లులను తహసీల్దార్ ప్రభాకర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యాన్ని గడువులోగా మిల్లింగ్ చేసి అందించాలని యజమానులకు సూచించారు. ఆయన వెంట గిర్దావర్ సయ్యద్ ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ..

మండల కేంద్రంలోని జరీనా కాలనీలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు. కేంద్రానికి వచ్చే లబ్ధిదారుల వివరాలను టీచర్ కళావతిని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

జక్రాన్‌పల్లి, జనవరి 23 : మండలంలోని తొర్లికొండ వీడీసీ సభ్యులు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మంగళవారం కలిసి గ్రామ సమస్యలపై విన్నవించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బడ్జెట్ వచ్చిన వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వీడీసీ చైర్మన్ వెంకన్న, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోవూర్ పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు

మోస్రా (చందూర్), జనవరి 23 : మోస్రా మండలం గోవూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ఆటలపోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఎంసీ చైర్మన్ నన్నేసాబ్ హాజరై పోటీలను ప్రారంభించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

జక్రాన్‌పల్లి, జనవరి 23 : మండలంలోని చింతలూర్ పాఠశాల విద్యార్థులకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు కలిగోట్ శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికీ జీరో పొదుపు ఖాతాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సుకన్యా ప్రసాద్, సొసైటీ చైర్మన్ శ్రీనివాస్, హెచ్ఎం లచ్చన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జక్రాన్‌పల్లి, జనవరి 23 : జిల్లా పురిగిరి క్షత్రియ పెరిక సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బోడకుంటి సుధాకర్, ప్రధాన కార్యదర్శి బుద్ధె రాజేశ్వర్, శంకర్, సుదర్శన్, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలోపు షాపులు మూసివేయాలి: సీపీ

వినాయక నగర్, జనవరి 23: నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అత్యవసర సర్వీసులు మినహా అన్ని దుకాణాలను ప్రతి రోజూ రాత్రిపూట నిర్ణీత సమయంలోపు మూసివేయాలని సీపీ కల్మేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా యజమానులు సహకరించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేతాజీకి ఘన నివాళి

బాల్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థలు, కార్యాలయాలు, వసతి గృహాలు, వివిధ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేశారు.

–నమస్తే తెలంగాణ యంత్రాంగం, జనవరి 23

నందిపేట్‌లో నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాలనికి అనుగుణంగా పోటీ పడాలి

జిల్లా గణితఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఆవిష్కరిస్తున్న నగర మేయర్ నీతూకిరణ్

ఖిల్లీల్‌వాడి, జనవరి 23 : విద్యార్థులు చదువుపై శ్రద్ధ కనబర్చి, కాలనికనుగుణంగా పోటీపడాలని నగర మేయర్ నీతూకిరణ్ సూచించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని గణిత ఫోరం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని హరిచరణ్ మార్వాడీ పాఠశాలలో మంగళవారం జిల్లాస్థాయి గణిత ప్రతిభా పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మేయర్ హాజరై ప్రశ్నాపత్రాలను విడుదలచేసి మాట్లాడారు. మానవ జీవితంలో గణితం భాగమేనని, విద్యార్థులు భయం లేకుండా నేర్చుకోవాలన్నారు. పోటీలు నిర్వహిస్తున్న గణిత ఫోరం అధ్యక్షుడు కాంతారావు, ప్రధాన కార్యదర్శి కృష్ణను అభినందించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, గోపాలకృష్ణ, గంగాధర్, నారాయణ, సురేశ్, కిశోర్‌కుమార్, శ్రీనివాస్, మైఖేల్, పరమేశ్వర్, సతీశ్, రాధ, శైలజ పాల్గొన్నారు.

షబ్బీర్ అలీకి సన్మానం

సారంగాపూర్, జనవరి 23 : రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా నియమితులైన షబ్బీర్ అలీని రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ఉద్యోగులు హైదరాబాద్‌లో మంగళవారం కలిశారు. ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఉద్యోగులు శ్రీకాంత్, భూపతిప్రభు పాల్గొన్నారు.

బూత్ ఏజెంట్లు హాజరుకావాలి

కంఠేశ్వర్, జనవరి 23: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 25న 'నా పోలింగ్ బూత్–నా బాధ్యత' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని, జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు అందరూ హాజరుకావాలని సూచించారు.

సొంత భవనాలు నిర్మించాలి

డిచ్‌పల్లి, జనవరి 2 : మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాలల వసతిగృహాలకు సొంత భవనాలు నిర్మించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో యూనియన్ మండల అధ్యక్షుడు శివ మాట్లాడుతూ.. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మెస్ చార్జీలు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, రణధీర్, సాగర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

వినాయకనగర్, జనవరి 23: నిజామాబాద్ నగరంలో ఈ నెల 17న డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తుండగా కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలానికి చెందిన ఒకరు మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా, అతనికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు.

పేరుకే 'మహిళా' పోలీస్ స్టేషన్

- సమస్యలు వినేందుకు మహిళా సిబ్బంది కరువు
- సీపీ దృష్టికి తీసుకెళ్లిన ఓ బాధితురాలు

వినాయకనగర్, జనవరి 23: జిల్లా కేంద్రంలోని మహిళా పోలీస్ స్టేషన్‌కు న్యాయం కోసం వెళ్లిన బాధిత మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలను చెప్పుకునేందుకు మహిళా సిబ్బంది లేకపోవడంతో పురుష సిబ్బందికి వివరించలేక అవమానకరంగా భావిస్తున్నారు. దంపతుల మధ్య గొడవలు, కుటుంబ కలహాల కారణంగా బాధలు పడుతున్నవారిని గంటల తరబడి నెలబెట్టే కౌన్సెలింగ్ ఇస్తున్నారు. నిజామాబాద్ నగరానికి చెందిన ఓ మహిళ తన సమస్యపై మహిళా పోలీస్ స్టేషన్‌కు వెళ్లగా ఇలాంటి ఇబ్బందులనే ఎరుర్కొన్నది. దీంతో సీపీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేసింది. తన సమస్యను చెప్పుకునేందుకు, కౌన్సెలింగ్ నిర్వహించేందుకు మహిళా సిబ్బందిని నియమించాలని కోరింది.

సీఐపై డీసీపీ ఆగ్రహం..

ఈ విషయాన్ని అదనపు డీసీపీ జయ్‌రాం సీరియస్‌గా తీసుకున్నారు. సీఐని తన కార్యాలయానికి పిలిపించి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టేషన్‌లో మహిళా సిబ్బందిని ఎందుకు అందుబాటులో ఉంచలేదని ప్రశ్నించారు. కుర్చీలు ఉండగా బాధితులను నిలబెట్టి కౌన్సెలింగ్ ఇవ్వడంపై మండిపడ్డారు.

పూర్వ విద్యార్థి సహకారంతో టై, బెల్టుల పంపిణీ

టై, బెల్టులను అందజేస్తున్న బాబూరావు

డిచ్‌పల్లి, జనవరి 23 : మండలంలోని ఖిల్లా డిచ్‌పల్లి జడ్పీహెచ్ఎస్‌లో చదువుతున్న బాలలకు పూర్వవిద్యార్థి బాబూరావు (పంచాయతీ రాజ్ డీఈ) సహకారంతో టై, బెల్టులను పంపిణీ చేస్తున్నారు. ఇందుకోసం బాబూరావు రూ. 20వేలు అందించగా, ఆయనను హెచ్ఎం సీతయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ఖిలీల్‌వాడి, జనవరి 23 : నగరంలోని నాగారం మైనారిటీ గురుకులంలో 5 నుంచి 9వ తరగతి, ఇంటర్ (సీఈసీ, హెచ్ఈసీ)లో ప్రవేశాల కోసం మైనారిటీలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ఇతర వివరాలకు 8790297891, 9666610902 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

దొంగను గుర్తిస్తే సమాచారం ఇవ్వాలి

అల్తాఫ్

జక్రాన్‌పల్లి, జనవరి 23 : హైదరాబాద్‌కు చెందిన అల్తాఫ్ మండలంలో బ్లాక్ కలర్ పల్సర్ బైక్‌పై తిరుగుతూ ఒంటరి మహిళలు, వృద్ధులను టార్గెట్ చేసి ఆభరణాలు చోరీ చేస్తుంటాడని, ఆయన కనిపిస్తే వెంటనే 8712659862 నంబర్‌కు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని పోలీసులు సూచించారు. ఆయన బట్టతల, క్యాప్ పెట్టుకొని కుడికాలుతో కుంటుతూ నడుస్తాడని తెలిపారు.

బ్రాహ్మణులకు డిజిటల్ ఐడీకార్డులు

సుభాష్‌నగర్, జనవరి 23: వివిధ సంస్థలకు సంబంధించిన సేవలను బ్రాహ్మణులు రాయితీపై పొందేందుకు డిజిటల్ గుర్తింపు కార్డులను ఫిబ్రవరి 11న జిల్లాకేంద్రంలోని గీతాభవనంలో పంపిణీ చేస్తామని బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాల శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 6302037967 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పీజీ, ఇంటిగ్రేటెడ్ పరీక్షలు ప్రారంభం

డిచ్‌పల్లి, జనవరి 23 : టీయూ అనుబంధ కళాశాలల్లో పీజీ, ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సులకు సంబంధించిన 3, 5, 7, 9వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రార్ యాదగిరి టీయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భవనంలోని పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

టెండర్లకు ఆహ్వానం

శక్కర్‌నగర్, జనవరి 23: బోధన్ పట్టణంలోని శ్రీ చక్రేశ్వర శివమందిరంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే జాతర ఏర్పాట్లలో భాగంగా వివిధ అంశాలకు గాను టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో శ్రీరాం రవీందర్‌గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో రంగులు, సున్నాలు, లైటింగ్, డెకోరేషన్, సౌండ్ సిస్టం, క్యూలైన్లకు బారికేడ్ల ఏర్పాటు, పూల అలంకరణతో పాటు పలు అంశాలకు ఆసక్తి కలిగిన వారు సీల్డు టెండర్లు సమర్పించాలని సూచించారు. టెండర్లను ఆలయంలో ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల వరకు అందజేయాలని పేర్కొన్నారు. సీల్డ్ టెండర్లను అదే తేదీన మధ్యాహ్నం 2 గంటలకు దేవాదాయశాఖ పర్యవేక్షణాధికారి సమక్షంలో తెరిచి అర్హత కలిగిన వారి పేర్లు వెల్లడిస్తామని తెలిపారు.

చెరువులో పడి మత్స్యకారుడి మృతి

నవీపేట,జనవరి 23: చేపల వేటకు వెళ్లిన ఓ మత్స్యకారుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మద్దేపల్లి గ్రామానికి చెందిన బట్టు శ్రీకాంత్(22) అనే మత్స్యకార్మికుడు ఈ నెల 21న చేపలు పట్టడానికి సైకిల్ పై నాగేపూర్ బండ్ల కుంట చెరువుకు వెళ్లాడు. చేపలు పట్టే ప్రయత్నంలో చెరువులో వేసిన వల చుట్టుకోవడంతో ఊపిరి ఆడక మృతి చెందాడు. శ్రీకాంత్‌కు ఆరునెలల క్రితం వివాహం జరిగింది. మృతుడు తల్లి బట్టు సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

మోర్తాడ్, జనవరి 23: కేంద్రప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని దొన్కల్, గాండ్లపేట్, వడ్యాట్, దోన్‌పాల్ గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచులు కత్తిలావణ్య, సౌజన్య, వెల్మరూప, పర్సదేవన్న, ఎంపీటీసీలు కళావతి, అశోక్, ఎంపీవో శ్రీధర్, ఏపీవో శకుంతల, ఏవో లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బిజీబిజీ

చౌటపల్లి కోటి లింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి దంపతులు

భీమ్‌గల్/ కమ్మర్‌పల్లి/ బాల్కొండ/ వేల్పూర్, జనవరి 23: బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి మంగళవారం రోజంతా బిజీబిజీగా గడిపారు. భీమ్‌గల్ మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం లక్ష్మీనర్సింహాస్వామి ఆలయాన్ని సతీసమేతంగా దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలో శ్రీకోటి లింగేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి–నీరజ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికలకు ముందు శ్రీపత్యంగిరా మాత త్రిశూలమునకు కట్టిన ముడుపులు విప్పి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం శ్రీపత్యంగిరా మహాయాగం పూర్ణాహుతి చేశారు. దంపతులను ఆలయ నిర్మాణ ధర్మకర్తలు గంగాప్రసాద్ దీక్షితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. బాల్కొండ మండలంలోని ఇత్వార్‌పేట్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను వేముల పరామర్శించారు.

వేల్పూర్‌లో పీఆర్టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల

వేల్పూర్ మండల కేంద్రంలోని తన నివాసంలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పీఆర్టీయూ, బాల్కొండ నియోజకవర్గ వ్యవసాయశాఖ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు.

నేడు భీమ్‌గల్‌లో వేముల పర్యటన

భీమ్‌గల్/వేల్పూర్, జనవరి 23 : బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం భీమ్‌గల్ మండలంలో పర్యటించనున్నారు. మండలంలోని రూప్లాతండాలో ఉదయం 10 గంటలకు రూ. 20 లక్షలతో నిర్మించిన జీపీ భవనం, 11 గంటలకు జాగిర్యాల్‌లో రూ.20 లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్, మధ్యాహ్నం 12 గంటలకు దేవన్‌పల్లిలో రూ. 20 లక్షలతో నిర్మించిన జీపీ భవనం, 2.30 గంటలకు లింగాపూర్‌లో రూ.20లక్షలతో నిర్మించిన జీపీ భవనం, 3.30 గంటలకు పల్లికొండలో రూ.12లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానను ప్రారంభించనున్నారు. సాయంత్రం 4.30 గంటలకు పిప్రిలో రూ.20లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్‌సెంటర్‌ను ప్రారంభిస్తారని స్థానిక బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

ఆర్మూర్‌టౌన్, జనవరి 23: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని ఆర్డీవో వినోద్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో రోడ్డు భద్రతా మహోత్సవాల పోస్టర్లను ఆర్డీవో వినోద్ కుమార్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారు నడిపే వారు సీటుబెల్టు ధరించాలని సూచించారు. ఎంవీఐ వెంకట స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో వినోద్ కుమార్

బస్సుల కోసం విద్యార్థుల రాస్తారోకో

బోధన్ రూరల్, జనవరి 23: సాలూర మండల కేంద్రంలో స్పెషల్ బస్సులను నడిపించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు సాలూర–మహారాష్ట్ర రోడ్డుపై మంగళవారం రాస్తారోకో చేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకం బాగుందని, కానీ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక బస్సులు నడపాలని గతంలో మూడుసార్లు ధర్నాచేసినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పోలీసులు చేరుకొని విద్యార్థులను సముదాయించి ధర్నాను విరమింపజేశారు.



సాలూరలో రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు

కొనసాగుతున్న బడాపహాడ్ ఉర్సు

వర్ని మండలంలోని బడాపహాడ్ ఉర్సు కొనసాగుతున్నది. రెండో రోజైన మంగళవారం షాదుల్లా దర్గాను భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. రాత్రి నిర్వహించిన కవ్వాలీని భక్తులు తిలకించారు. ఉత్సవాలకు రాష్ట్రంతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తున్నారు.

–వర్ని, జనవరి 23

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నవీపేట, జనవరి 23: వచ్చే మార్చిలో నిర్వహించే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ సూచించారు. మంగళవారం ఆయన నవీపేట బాలుర, బాలికల పాఠశాలతో పాటు మోకన్‌పల్లి కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. బాలుర పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని డీఈవో పరిశీలించి, విద్యార్థులకు అల్పాహారంతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. లేనిపక్షంలో ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బెల్టు షాపులపై దాడులు

ఎడపల్లి, జనవరి 23 : మండలంలోని సాటాపూర్ గేట్, కుర్నాపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన బెల్టు షాపులపై బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్, నిజామాబాద్ డీటీఎఫ్ ఎస్సై గంగాధర్ ఆధ్వర్యంలో మంగళవారం దాడులు చేపట్టారు. కుర్నాపల్లిలో అక్రమంగా బెల్టు షాపులు నిర్వహిస్తున్న ఇద్దరు, సాటాపూర్ గేట్‌కు చెందిన ఒకరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ దాదాపు రూ. 20 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై బాలయ్య, కానిస్టేబుళ్లు ఉన్నారు.

PUBLIC NOTICE

General public are hereby informed that my client M/S Shriram Finance Ltd, Nizamabad Branch-II, Dist. Nizamabad agreed to accord Loan to Borrower **Dr.Kethavath Mothilal** S/o Jai Ram, Occ:Medical Practitioner, R/o H.No. 5-4-140, Shashank Hospital, Saraswathinagar, Nizamabad on mortgage of the schedule referred property The above prospective loanee agreed to create first charge against schedule Building property mentioned below in favor of my client company. If any person having any title, claim, or objection of whatsoever nature may put forth their claims before me within **5 days** of this notice. The objections raised afterwards shall be deemed to be "Waived and not binding on my client Company and my client shall proceed further for according above loan by Mortgage of the schedule property...

Hence this notice.

SCHEDULE OF THE PROPERTY

The existing RCC Residential Apartment bearing Flat No.306, with M.No.5-7-64/306 in Third Floor Pf "Feel Well" Towers, in ward No.5 Block no-7 situated at Khaleelwadi, Nizamabad town of Nizamabad District amdeasuring plinth area of 1321 Sq feets including share in common area together with undivided share of land admeasuring 36-69 Sq.Yds (Subject matter of the Regd.Sale Deed Doct No.12241/2016 Dt.15-12-2016 SRO Nizamabad)

As Bounded by : North : Open to sky and then flat no.301, **South:** Open to Sky **East :** 6'-0" wide corridor, Open to Sky and then flat no.305, **West:** Open to Sky

Sd/- R.JAGADISHWER RAO, Advocate Subashnagar,Nizamabad,Cell:98480 94409.

మహిళ మెడలో నుంచి గోల్డ్‌చైన్ చోరీ

ఆర్మూర్‌టౌన్, జనవరి 23: ఆలూర్ మండలం దేగాం గ్రామంలో మంథని గంగుబాయి అనే మహిళ మెడలో నుంచి రెండున్నర తులాల బంగారపు గొలుసును గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. మధ్యాహ్నం ఒంటరిగా ఉన్న గంగుబాయి ఇంట్లో గుర్తు తెలియని దుండగుడు చొరబడ్డాడు. ఆమె మెడలో ఉన్న బంగారపు గొలుసు లాక్కొని ఎత్తుకెళ్లాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మాక్లూర్ మండల సమావేశం

పలువురు ఎంపీటీసీలు గైర్హాజరు

సమావేశంలో నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న మెట్‌పల్లి సర్పంచ్ సాయిలు

మాక్లూర్, జనవరి 23: మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ మాస్త ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం సాదాసీదాగా కొనసాగింది. సమావేశానికి మొత్తం 14 మంది ఎంపీటీసీలకు ఐదుగురు మాత్రమే హాజరుకాగా. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన మదన్‌పల్లి ఎంపీటీసీ గోవూరి ఒడ్డెన్న గ్రూపుకు చెందిన 9 మంది ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. దీంతో 1/3 మెజార్టీతో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో అక్రమ మొరం క్వారీల నిర్వహణ అధికారుల అండదండలతోనే కొనసాగుతున్నదని, వీటిని అరికట్టాలని మండల సభ్యులు తీర్మానం చేస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షబ్బీర్‌ను కోరారు. మొరం అక్రమరవాణాతో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి సంబంధాలు ఉన్నాయంటూ ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. కాంగ్రెస్‌పార్టీ 6 గ్యారెంటీల పథకాలు అమలు చేయాలని ప్రజల పక్షాన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులుగా పోరాడుతామన్నారు. రూ.4.50 లక్షల ఈజీఎస్ బిల్లులు రాలేదని, పీఆర్ఏఈ శ్రీనివాస్ ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తూ మెట్‌పల్లి సర్పంచ్ కుంటోల్ల నేలపై కూర్చొని నిరసన తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సుక్కి సుజాత, ఎంపీడీవో జైక్రాంతి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ గంగారాం, ఆయా శాఖలకు చెందిన అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

శివసేన ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

బోధన్, జనవరి 23: శివసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బాల స